ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024 | 5 | కర్నూలు



కప్పట్రాళ్లకు 'అణు' వణుకు...



కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం

దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామం

- యురేనియం తవ్వకాలకు సిద్ధం - ఆందోళనలో స్థానికులు

- తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరిక

కప్పట్రాళ్లతో పాటు పరిసర గ్రామాలకు అణు ముప్పు పొంచి ఉంది. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు యుసిఐఎల్ సంస్థ అన్ని అనుమతులతో సిద్ధం అవుతోంది. ఈ వార్త స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రమాదకరమైన ఆ రసాయన మూలకం తవ్వకంతో తమ ప్రాణాలకే ముప్పు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా యురేనియం తవ్వకాలను అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అత్యంత ప్రమాదకరమైన రసాయన మూలకం యురేనియం. నేల పొరల్లోంచి తవ్వి తీయడమంటే మృత్యువును నెత్తికెత్తుకున్నట్లే. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచానికి ఈ అణు ధార్మిక దేశాల్లో అణు విద్యుత్ ప్లాంట్లు మూసేశారు. కానీ మన ప్రభుత్వాలు మాత్రం యురేనియం తవ్వుతున్నాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం నిల్వల నిగ్గుతేల్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండీ) 70 బోర్ల తవ్వకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అందులో 68 బోర్ల తవ్వకాలకు కేంద్రం అనుమతినిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 1,170.625 ఎకరాల్లో అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. కౌలుట్లయ్య మలగా పిలిచే ఈ రిజర్వు ఫారెస్ట్ కప్పట్రాళ్ల, పి.కోటకొండ, మాదాపురం, చెల్లెలచెలిమిల, గుండ్లకొండ గ్రామాల మధ్య విస్తరించింది. ఆ కొండపైనే కౌలుట్లయ్యస్వామి ఆలయం ఉంది. 2017 ప్రాంతంలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో 8 చోట్ల బోర్ల త్రవ్వకాలను జరిపి ఆ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారు. భూగర్భంలో ఎంత పరిమాణంలో యురేనియం నిల్వలు ఉన్నాయో నిర్ధారించిన తరువాతే తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అందుకే కప్పట్రాళ్ల కేంద్రంగా యురేనియం ఎంత ఉంది? ఎలా ఉంది? ఎంత లోతులో ఉంది? తవ్వితే లాభమా.. కాదా..? వంటి వివరాలు తెలుసుకునేందుకు 68 బోర్లు డ్రిల్లింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అటవీ భూముల్లో తవ్వకాలు జరపాలి కాబట్టి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. ప్రభుత్వ రంగ సంస్థ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) తరపున అటవీ శాఖకు చెందిన 17 ఎకరాల్లో బోర్లు తవ్వేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహా మండలి ఆమోదం కోసం అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండీ) రీజినల్ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపారు. ఈ విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా కొనసాగించారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా యురేనియం తవ్వకాలను అడ్డుకుని తీరుతామని చెబుతున్నారు.

పచ్చని పొలాలు కనుమరుగవుతాయి



కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ ఉండే పొలాల్లో నీటి బోర్లు వేసుకొని పంటలు, పండ్లతోటలు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాం. యురేనియం తవ్వకాలు చేపడితే పచ్చని పొలాలు కనుమరుగవుతాయి. విషతుల్యం ఏర్పడి గడ్డి పరక కూడా మలచదు. దీంతో పొలాలు బీడు బారిపోతాయి. ఎలాగైనా తవ్వకాలను అడ్డుకుంటాం.

- సందు పాలెం లాలప్ప, కప్పట్రాళ్ల.

పోరాటాలకు సిద్ధం



కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేపడితే చుట్టుపక్కల ప్రాంతాలకు ముప్పు వాటిల్లుతుంది. తవ్వకాల విషతుల్యంతో అటవీ ప్రాంతం చుట్టూ ఉండే కప్పట్రాళ్ల, చెల్లెల చెలిమల, జిల్లేడు బుడకల, బంటుపల్లి, మాదాపురము, కోటకొండ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. యురేనియం తవ్వకాలపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలి. తవ్వకాలు విరమించుకోకుంటే రైతులు, ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతాం.

- వీరశేఖర్, సిపిఎం దేవనకొండ మండల కార్యదర్శి.

తవ్వకాలపై జిల్లా అధికారులు స్పందించాలి



అటవీ ప్రాంతంలో యురేనియం బోర్ల తవ్వకాలు అనుమతి పొందిన అటామిక్ మినరల్ డైరెక్టర్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండి) సంస్థ తవ్వకాలు చేపట్టనున్నట్లు ప్రచారాలు సాగుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు స్పందించాలి. యురేనియం తవ్వకాలతో అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న ఆరు గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి అటవీ ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకాలు ఆపకపోతే ఉద్యమిస్తాం.

- రాజు, కప్పట్రాళ్ల.

విశ్వవిద్యాలయం అభివృద్ధికి చర్యలు

- హాస్టల్లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

- విద్యార్థులకు హాజరు శాతం తప్పనిసరి

- ప్రజాశక్తితో ఆర్‌యు ఇన్‌ఛార్జి విసి ఎన్‌టికె నాయక్



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. ప్రధాన సమస్యలపై దృష్టి సారించాం. హాస్టల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు 100 శాతం తరగతులకు హాజరు కావాల్సిందే. అధ్యాపకుల కొరత, వారి జీతభత్యాల గురించి పూర్తిస్థాయి పాలకమండలి వచ్చాక తగుచర్యలు తీసుకుంటాం. కొత్తకోర్సులు ప్రవేశపెట్టేందుకు అడుగురు ముందుకేస్తున్నాం. ఇక్కడ పరిష్కారం కానివి పైకమిటీకి నివేదిస్తాం. గత సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.' అని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ అన్నారు. ఆయన ప్రజాశక్తికి పలు వివరాలను వెల్లడించారు.

రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?.

విసి: రాయలసీమ విశ్వవిద్యాలయం ఇలాంటి వెనుకబడిన ప్రాంతంలో ఏర్పాటు చేయడం పట్ల ఉన్నత విద్యారంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. ఈ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

ఆర్‌యులో ఎలాంటి సమస్యలు ఉన్నాయి?వాటిని ఎలా పరిష్కరిస్తారు?.

విసి: విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థులు ప్రధానంగా అనేక సమస్యలను ఎదుర్కొంటు న్నారు. హాస్టల్లో విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించడమే కాకుండా అక్కడ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా మిగిలిన కొన్ని సమస్యలను గుర్తించాం వాటిని కూడా త్వరలోనే పరిష్కారానికి అడుగులు వేస్తాం.

విశ్వవిద్యాలయంలో పిజి లాంటి కోర్సులను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలను పొందలేకపోతున్నారు? కారణమేంటి?

విసి: విశ్వవిద్యాలయంలో పిజి పూర్తి చేసిన విద్యార్థి వెంటనే బయటికి వెళ్ళగానే ఉపాధి అవకాశం పొందాలి. అందులో భాగంగా ఉన్నత విద్యా మండలి దృష్టికి తీసుకువెళ్లి ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన శిక్షణ కూడా ఇక్కడే ఇప్పించేందుకు దృష్టి పెడుతున్నాం.

ఈ విశ్వవిద్యాలయంలో మినిమం టైం స్కేల్ కింద పనిచేసే ఉద్యోగులకు సరైన వేతనాలు అందడం లేదు ? మీ స్పందన ఏమిటి

విసి: పాలకమండలి ఏర్పాటు చేసిన తర్వాత వెంటనే ఉద్యోగుల సమస్యపై కూడా చర్చించి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

విశ్వవిద్యాలయంలో ఓ ఉన్నతాధికారిపై కొంతమంది దాడి చేయడానికి పూనుకున్నారు. ? దీనిపై మీ స్పందన ఏంటి?..

విసి: విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. ఎవరైనా దాడులకు పాల్పడితే సహించేది లేదు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

విశ్వవిద్యాలయంలో కొన్ని డిపార్టుమెంట్ల కోర్సుల్లో విద్యార్థులు లేక క్లోజ్ చేసిన పరిస్థితులు ఉన్నాయి? ఏమైనా కొత్త కోర్సులను ప్రవేశపెడతారా?

విసి: విశ్వవిద్యాలయంలో రాబోయే రోజుల్లో అన్ని డిపార్టుమెంట్లలో ఉన్న కోర్సుల్లో సీట్లన్నీ భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వీటితోపాటు కొత్త కోర్సులను కూడా ప్రవేశపెట్టేందుకు అడుగులు వేస్తున్నాం. గతంలో జరిగిన విధంగా పునరావృతం కాకుండా చూస్తాం.



టమోటా ధర పతనం



పత్తికొండలో టమోటా మార్కెట్

ప్రజాశక్తి-పత్తికొండ

టమోటా ధరలు రోజురోజుకు పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కు పత్తికొండ ,తుగ్గలి మద్దికేర ,ఆస్పరి, ప్యాపిలి, ఆర్ఎస్ పెండేకల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో పండించిన టమోట పంటను రైతులు మార్కెట్ కు తీసుకొస్తున్నారు. గత 15 రోజుల నుండి టమోట ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మార్కెట్‌లోని వ్యాపారస్తులు సిండికేట్‌తో టమోట ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు మార్కెట్‌కు 100 క్వింటాళ్ల టమోట సరుకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్, మహానగరాలకు టమోటాను వ్యాపారస్తులు సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో టమోట కిలో రూ.40 పలుకుతుంది. వ్యాపారస్తులు సిండికేట్ కావడంతో కిలో గనిష్ఠ ధర రూ.5, మధ్యస్థం రూ.10, గరిష్ఠ ధర రూ.15 కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ వేలంపాటలో అధికారులు పర్యవేక్షించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



టమోటా పంటను సాగు చేసి, పంట పండించి మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారస్తులు సిండికేట్ కావడంతో ధరలు పూర్తిగా తగ్గిస్తున్నారు. కిలో టమోట రూ.20 కూడా కొనడం లేదు. ఇలాగే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

- రైతు లక్ష్మీదేవి, పత్తికొండ.

యూనివర్సిటీల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో యూనివర్సిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళిక సిద్ధం చేసి అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలో యూనివర్సిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఉన్నత విద్యా వ్యవస్థ కుంటుపడిందని, దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. జిల్లాలో ప్రధానంగా మూడు యూనివర్సిటీలు ఉన్నాయని వాటి అభివద్ధిని గత ప్రభుత్వం మరిచిందని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే జిల్లాల్లో ఉండే యూనివర్సిటీల అభివృద్ధికి రూ.600 కోట్లు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరూ కూడా పట్టించుకోకుండా ఉన్నత విద్యా వ్యవస్థను నాశనం చేసారని, ఎవ్వరూ కూడా యూనివర్సిటీల అభివృద్ధి కొరకు నోరుమెదపలేదని ఇది చాలా సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత జిల్లా ప్రజా ప్రతినిధులు తక్షణమే ప్రభుత్వంతో చర్చలు జరిపి యూనివర్సిటీని అభివృద్ధి చేయాలన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అందుకోసం వచ్చే రాష్ట్ర కేబినెట్ భేటీలో జిల్లా యూనివర్సిటీల అభివృద్ధి కోసం నోరుమెదపాలని జిల్లా ప్రజాప్రతినిధులును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా ఉద్యమ ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, రాజు, మౌలాలి, భరత్, జోష్,శివాజీ, సీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోచ మ్మ

ఎపి ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధం కావాలని ఎపి ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. పోచమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో ఆశ వర్కర్ల జిల్లా స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం డి.శివలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కె.పోచమ్మ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ధరలు కనుగుణంగా వేతనాలు రూ.26 వేల పెంచాలని రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలన్నారు. ఆశ వర్కర్లకు 11 డిమాండ్లు గత ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు చేసి జిఒ రూపంలో వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. హామీని ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించాలని పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతావని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురి చేయటం వల్ల అనేకమంది మానసికంగా ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆత్మహత్యలకు గురి చేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని చెప్పారు. ఆశ వర్కర్ల భర్తీలో రాజకీయ జోక్యం ఉండరాదని ఎమ్మెల్యే పిఎన్ఎంల విధులు నిర్వహించకుండా కొంతమంది ఆశ వర్కర్లను పని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. తక్షణమే సచివాలయ డ్యూటీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకుంటే చలో విజయవాడ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆ పోరాటంలో ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజి బాబు, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మలమ్మ మాట్లాడుతూ ఆశ వర్కర్లందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని అర్బన్ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వారందరిని, వారి నివాస ప్రాంతాలకు బదిలీ చేయాలని చెప్పారు. అనంతరం 36 మందితో నూతన జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఆశ వర్కర్లు ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బి శివలక్ష్మి, ఈశ్వరి బాయ్ ఎన్నుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పిహెచ్‌సిల నుండి ప్రతి పిహెచ్‌సికి కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యురాలుగా ఎన్నిక అయింది. 17 మంది ఆఫీస్ బేరర్స్‌గా రమీజాబీ ,సుబేదా, అలివేలమ్మ, జ్యోతి, శారద, వెంకటమ్మ, అనిత, త్రివేణి, మాధవి, దస్తగిరమ్మ, కాంతమ్మ, మహేశ్వరి తదితరులను ఎన్నుకున్నారు.

నగరపాలక సంస్థలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీలు సమర్పించాలని ప్రజలను కోరారు. ఉదయం 10 గంటల నుండి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు అవసరం

పట్టణ నిరాశ్రయ వసతి గృహం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రస్తుతం ఉన్న సీజన్‌లో ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయ వసతిగృహంలోని వృద్ధులకు ఆయన దోమకాటుకు గురి కాకుండా అవసరమైన దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సీజన్లో దోమలు అధికంగా ఉంటాయని, వాటి కాటుకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు. దోమ కాటుకు గురైతే మలేరియా, డెంగ్యూ, ఎన్సీఫలైటిస్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కోరారు. పట్టణ నిరాశ్రయ వసతి గృహంలోని వృద్ధుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రానున్న కాలంలో వారికి దోమతెరలు, పాద రక్షలు వంటి వాటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. వారికి పౌష్టిక ఆహారం అవసరం ఎంతో ఉందని, తక్కువ ధరలో పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో ధనికులు.. పేదల మధ్య వ్యత్యాసం ఎంతో కనపడుతుందని, దానికి తగిన కారణాలు కనపడడం లేదని వివరించారు. పేదలు... ధనికుల మధ్య తేడాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పట్టణ నిరాశ్రయ వసతిగృహం లోని పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు నగరంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూనే తన వంతు సహాయంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానని డాక్టర్ శంకర్ శర్మ వెల్లడించారు.



పట్టణ నిరాశ్రయ వసతి గృహంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సేవకు ప్రతిఫలం దక్కేనా

-35 ఏళ్లుగా టిడిపికి అరుణ కుమారి సేవలు

-ఎమ్మెల్సీ లేదా చైర్మన్ గిరి ఇవ్వాలని ప్రజాసంఘాల డిమాండ్

-ప్రజాప్రతినిధుల సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నూతనంగా అధికార పగ్గాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన వారికి తగిన గౌరవాన్ని ప్రతిష్టను కల్పించేందుకు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఇప్పటికే శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పార్టీ కోసం దాని అభివృద్ధి కోసం త్యాగాలు చేసిన వారి పేర్లను కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని నాటి అధికార పార్టీ ఒత్తిళ్లను దాడులను ఎదిరించి నిలిచిన నాయకులు, కార్యకర్తల బయోడేటాలను పార్టీ అధిష్టానం సేకరించి పరిశీలిస్తోంది. ఇప్పటికే అందులో కొన్ని కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లను కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలంగా పార్టీ కోసం సేవలు అందించిన మహిళ, నాయకురాలు సి. అరుణ కుమారి పేరు ప్రస్తుతం నామినేటెడ్ పదవుల రేసులో బలంగా వినిపిస్తోంది. అరుణకుమారి దాదాపు పార్టీ ఆవిర్భావం తొలి రోజుల్లో (1986) నుంచి ఇప్పటివరకు వివిధ స్థాయిలో కార్యకర్తగా, నాయకురాలిగా అన్నితానై నిబద్ధతతో పనిచేస్తూ వచ్చారు. ప్రధానంగా జిల్లా మహిళా అధ్యక్షురాలుగా మహిళా విభాగంలో ఎంతో మంది మహిళలను చైతన్యవంతం చేశారు. జిల్లా ఎన్నికల పరిశీలక సభ్యురాలిగా వివిధ నియోజకవర్గాల్లో పోటీచేసి టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం కషి చేశారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా పార్టీ అభివద్ధి కోసం కేడర్లో అనేక విషయాలను బోధించి చైతన్యాన్ని నింపారనడంలో ఎలాంటి అతిశక్తి లేదు. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా కేడర్ కు మార్గదర్శకంగా బాధ్యతలను నిర్వహించారు. పార్టీలో ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వాటిని క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా జయప్రదం చేస్తూవచ్చారు. అనేకమంది పార్టీ సభ్యులకు, కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని నేరుగా అధికారుల దృష్టికి, పార్టీ ప్రజాప్రతినిధుల దృష్టికి, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించి బాధితులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ వచ్చారు. తన ఆదర్శ వివాహం ద్వారా సామాజిక అసమానతలు ఏ మాత్రం ఆచరణీయం కాదని నిరూపించారు. మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా సైన్స్ ప్రచార రంగం (జన విజ్ఞాన వేదిక)లో పూర్వ నాయకురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. అందులో భాగంగా 35 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ సేవ ప్రస్థానానికి గుర్తింపుగా విద్య రంగం నుంచి డాక్టరేట్ కూడా లభించింది. ఇవే కాకుండా సారా వ్యతిరేక ఉద్యమం, పొదుపు సంఘాలకు పావలా వడ్డీ పోరాటం, అంగన్వాడి డ్వాక్రా గ్రూపుల సమస్యలపై పోరాటాలు, విద్యార్థి యువజన రైతు మహిళ పోరాటాలు మరెన్నో చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు పార్టీ క్యాడర్‌లో, నాయకులు ప్రజాపతినిధుల్లో ప్రత్యేక గౌరవం ఉంది. ఆమె సేవలకు గుర్తింపుగా జిల్లాలో ఏదో నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్‌ను మహిళ బిసి కోటాలో కనీసం ఆమెకు దక్కి ఉండాల్సిందన్న చర్చ పలు ప్రజాసంఘాలు చేస్తున్నాయి. ప్రస్తుతం పార్టీలో నామినేటెడ్ పదవుల రేసు నడుస్తుండడంతో ఆమెకు ఎమ్మెల్యే పదవికి బదులుగా నామినేటెడ్ ఎమ్మెల్సీ గాని లేదా ఏదో ఒక కార్పొరేషన్ రాష్ట్ర చైర్పర్సన్‌గా నైనా నియమించాలని అటు పార్టీలోనూ ఇటు ప్రజా సంఘాల్లోనూ చర్చ నడుస్తోంది. ఇప్పటికే అనేక ప్రజా సంఘాలు ఆమెకు మద్దతుగా నిలిచాయి. ఆమె సేవలను గుర్తిస్తూ జిల్లాలోని దాదాపు ప్రజా ప్రతినిధులు ఆమెను ఆ పదవులకు సిఫార్సు చేస్తూ లేఖలు కూడా అందించినట్లు సమాచారం.



చంద్రబాబుతో సి.అరుణకుమారి

పోలీస్ అమరవీరులకు సెల్యూట్

నేడు పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

శాంతిభద్రతలను నెలకొల్పేందుకు పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం. ప్రజలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడంలో వారి పాత్ర ఎనలేనిది. అలాంటి పోలీసులు తమ విధుల్లో ఉంటూ ప్రాణాలను సైతం ప్రజాసేవలో ఘనంగా పెట్టిన వారిని స్మరించుకోవడం అన్నది ప్రతి పౌరుని కనీస బాధ్యత. పోలీసులు అంటేనే సమాజంలో కర్కశత్వానికి, కఠినత్వానికి ప్రతీక అన్న నింద వారిని వెంటాడుతున్నది. ఇదే నేపథ్యంలో ప్రజా శ్రేయస్సు కోసం అనేకమంది పోలీస్ అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి అమరవీరుల త్యాగాలను అవలోకనం చేసుకునేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 21ని పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం గా ప్రభుత్వం నిర్వహిస్తోంది. దేశ, రాష్ట్ర భద్రత కోసం పగలనక , రేయనక విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది డ్యూటిని విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి ప్రజల శ్రేయస్సుకోసం ప్రాణాత్యాగం చేశారు , చేస్తూనే ఉన్నారు.

సంస్మరణ దినోత్సవ నేపథ్యం ఇదీ

1959 అక్టోబరు 21న భారత్ – చైనా సరిహద్దు లఢఖ్ లోని హాట్ స్ప్రింగ్ వద్ద పహారాలో ఉన్న 10 మంది సిఆర్‌పిఎఫ్ జవానులపై చైనా చొరబాటుదారులు దాడి చేయగా ధైర్యసహసాలతో వారిపై ప్రతి దాడి చేస్తూ తమ చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి వీరమరణం పొందినారు . స్వాతంత్ర్యం తరువాత దేశభద్రత కోసం పోలీసులు ప్రాణాలు అర్పించిన మొట్టమొదటి సంఘటన అది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం విధినిర్వహణలో మరణించిన పోలీసువారి జ్ఞాపకార్థం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. జిల్లాలో ముగ్గురు పోలీసులు అమరులు కాగా, మరో 10 మంది పోలీసులు విధుల్లో ఉంటూ మృతి చెందారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

గ్రామాల అభివృద్ధి పల్లె పండుగ లక్ష్యం

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో పల్లె పండుగ – పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు ఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద సీసీ రోడ్ల, గోకులం షెడ్డు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం ఆవరణ లో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మొక్కలు నాటారు. జిల్లాపరిషత్ సిఇఒ , డ్వామ పిడీ నాసర రెడ్డి, మండల తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఒ శేషాచల రెడ్డి, కల్లూరు మండల అధ్యక్షుడు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఎంపిటిసి మేకల శేషన్న, నాయకులు శేఖర్, మహానంది, రామ గిడ్డయ్య, రవి, మండల నాయకులు మాదేష్, ఉలిందకొండ ఇవి రమణ, టిడిపి, బిజెపి,జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రూపులు వీడి అభివృద్ధి చేద్దాం

- టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

విభేదాలు వదలి, గ్రూపులు వీడి అందరూ కలిసి అభివృద్ధి చేద్దామని నాయకులకు, కార్యకర్తలకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో ఆ పార్టీ పట్టణ ఇంచార్జీ బి వరదరాజులు ఆధ్వర్యంలో నాయకులు అశోక్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచి ఇవ్వడం జరిగిందన్నారు. కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్న వారికి త్వరలో స్వచమైన మంచి నీటి సరఫరా అందించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. దీపావళి నుండి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్ల ఏర్పాటుకు పల్లె పండగ కార్యక్రమం ద్వారా భూమి పూజ చేశామని, ఇక్కడ కూడా 7 సిసి రోడ్ల ఏర్పాటుకు 40 లక్షలు మంజూరు అయిందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క సిసి రోడ్డు వేయని ఎమ్మెల్యే టిడిపి ప్రభుత్వంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాంపురం గ్రామంలో భూమి పూజ చేశారని ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో సిసి రోడ్ల ఏర్పాటుకు 2. 5 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, మరో కోటి రూపాయలకు ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు. అంతకు ముందు రామచంద్ర నగర్ కాలనీలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు ఏర్పాటుకు భూమి చేశారు. అనంతరం రాఘవేంద్ర నగర్ కాలనీకి చేరుకున్న ఆయనకు రాఘవేంద్ర చిన్నా ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో బాణా సంచా పేల్చి పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచ్ చావిడి వెంకటేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు నక్కి వెంకటేష్, డిసి తిమ్మప్ప, ఎంపిడిఓ శోభారాణి ఈవోపిఆర్‌డి ప్రభావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

నీటి సరఫరాలో డ్రైనేజీ నీటిని ఆపించండి

- ఎంపిటిసి నక్కి వెంకటేష్

గ్రామ పంచాయతీ నుంచి సరఫరా అవుతున్న నీటిలో డ్రైనేజీ నీరు సరఫరా అవుతోందని వెంటనే మంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డిని టిడిపి ఎంపిటిసి నక్కి వెంకటేష్ కోరారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి త్రాగు నీటి పైపు లైన్ ద్వారా డ్రైనేజీ నీరు వస్తుందని ఆ నీటిని స్నానాలకు వాడడం వల్ల దుర్వాసనతో దురద పుడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి నుండి రక్షించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలయ నిర్మాణాలకు సహాయం చేయడం తన అదృష్టమని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన చిప్పగిరిలోని తన స్వగృహంలో హోలగుందలో ఈరన్న దేవాలయం నూతన నిర్మాణమునకు ఆర్థిక సహాయం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విరుపాక్షిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి స్పందిస్తూ ఆలయ నిర్మాణమునకు తన వంతుగా రూ.15 వేలు అందజేశారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ సహకారం కావాలన్నా తోడ్పడడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



ఆదోని ఎమ్మెల్యే అనుచరుడి కబ్జా భాగోతం

- సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

- స్పందించని ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే అనుచరుడి కబ్జా భాగోతం బయట పడింది. సబ్ రిజిస్ట్రార్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో కబ్జా బండారం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎమ్మెల్యే పార్థసారథి నోరు మెదపకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది..

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అనుచరులపై ఇప్పటికే పలు ఆరోపణలు వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై పదే పదే ఆరోపణలు చేసిన జనసేన, టిడిపి నాయకులు ఇప్పుడు ఏమి చేస్తున్నారని పలువురు పేర్కొం టున్నారు. "ఎమ్మెల్యే అయితే ఆదోని పట్టణంలో ఇక కబ్జాలు అనే మాట వినిపించకుండా చేస్తా' అంటూ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఊదరగొట్టారు. నాలుగు నెలలుగా కాకముందే ఆయన అను చరుడు భూ కబ్జాకు పాల్పడ్డాడు. బాధితురాలి పేరుతో నకిలీ ఆధార్ కార్డును సృష్టించి రూ.కోట్ల విలువైన స్థలాన్ని తన తల్లి పేరుతో కబ్జా చేశారని బాధితులు వెలుగులోకి తెచ్చారు. ఎస్కేడీ కాలనీలో తమ స్థలం కబ్జాకు గురౌందని బాధితు రాలు కురువ హనుమంతమ్మ, కుమారులు కురువ హరీష్ బాబు, రాజశేఖర్ ఆదోని సబ్ రిజిస్టార్ అజూమియాకు శనివారం ఫిర్యాదు చేశారు. కురువ హనుమంతమ్మ పేరుపై ఎస్కేడీ కాలనీలో 1984లో ఆరు సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ అయ్యింది. సర్వే నంబర్ 380ఏ, 379బీలో ప్లాట్ నంబర్ 33సీ ఉంది. ఆమె కుటుంబం ప్రస్తుతం కర్నూ లులో నివాసముంటోంది. ఆ స్థలానికి రక్షణగా ఉండాలని తెలిసిన వారికి గడ్డివాము వేసేందుకు ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ సెంటు విలువ రూ.30 లక్షలు ఉంది. మొత్తం రూ.1.80 కోట్ల విలువ చేసే స్థలంపై ఎమ్మెల్యే అనుచరుడు డాక్టర్ రవికిరణ్ కన్ను పడింది. తన తల్లి జయలక్ష్మి పేరును కురువ హను మంతమ్మగా నకిలీ ఆధార్ కార్డు కృష్టించాడు. మూడు రోజుల క్రితం (ఈనెల 16వ తేదీన) రవికిరణ్ దర్జాగా తల్లిని జయలక్ష్మిని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకెళ్లి అతని బావమరిది అయిన చిప్పల సురేష్ బాబు పేరుపై రూ.1.80 కోట్ల విలువైన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇక తనకు అడ్డు ఎవరూ లేరని ఆ స్థలంలో గడ్డివాము వేసుకున్న వారిని ఖాళీ చేయించాడు. దీంతో బాధితులకు విషయం తెలిసి అధికారులను సంప్రదించి అవాకయ్యారు. ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకుని ఆరా తీశారు. ఆ స్థలం వారి పేరు మీద లేకపోవడంతో ఆందోళన చెందారు. విచారణ చేయగా కురువ హనుమంతమ్మ పేరును మాత్రమే ఆధార్ కార్డులో ఫోర్జరీ చేసి రవికిరణ్ తల్లి జయలక్ష్మి వేరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వెలుగు చూసింది. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ అజూమియా దృష్టికి తీసుకెళ్లగా నకిలీ డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో వేలిముద్రను పరిశీలించగా రవికిరణ్ తల్లి జయలక్ష్మిదని బయటపడింది. విలువైన స్థలాన్ని దర్జాగా కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఎం

తప్పుడు ఆధారాలతో అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. చిన్న పొరపాటు ఉంటే సవా లక్ష నిబంధనలు పెట్టే అధికారులు అంత విలువైన స్థలాన్ని ఫోర్జరీ ఆధార్ కార్డుతో ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో కబ్జాలకు తావు లేదని చెప్పిన ఎమ్మెల్యే పార్థసారథి అతని అనుచరుడే కబ్జాకు పాల్పడడం చూస్తుంటే అతని అండదండలు ఉన్నాయని అనుమానం కలుగు తోందని, దీనిపై ప్రత్యేకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

టిడ్కోపై అయిష్టత

- ఇళ్లల్లో చేరేందుకు లబ్ధిదారుల విముఖత

- లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని అధికారుల ఆదేశాలు

ప్రజాశక్తి - ఆదోని

పేదల సొంతింటి కల కలగానే మిగిలింది. ప్రభుత్వాలు మారిన పేదల తలరాత మారడం లేదు. అధికారంలోకి రాగానే పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని చెబుతూనే ఉన్నారు. అధికారంలోకి రాగానే గృహాలు నిర్మించి ఇస్తామని హామీని మరచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ పేదల సొంతింటి ఆశను ఆశగానే మిగులుస్తున్నారు. ఇందిరమ్మ గృహాలు, టిడ్కో గృహాలు, జగనన్న కాలనీ, ఎన్టీఆర్ గృహాలు అంటూ పథకాలు అమలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే మగ్గిపోతున్న పరిస్థితి నెలకొంది. గతంలో టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాల్లో చేరేందుకు లబ్ధిదారులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. వాటిలో సౌకర్యాలు లేకపోవడమే అందుకు కారణం..

ఆదోని పట్టణ శివారులోని సిరుగుప్ప రోడ్డులో టిడ్కో గృహ సముదాయం 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. అప్పట్లో గృహ నిర్మాణాలు 90 శాతం పూర్తయిందని గృహాల కేటాయింపు కూడా జరిగిందని గృహ ప్రవేశాలు కూడా చేయించామని అప్పట్లో హంగామా చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టిడ్కో గృహ సముదాయాన్ని వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందన్న ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా జగనన్న కాలనీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల దృష్ట్యా టిడ్కో గృహాల కేటాయింపు ప్రక్రియ కూడా చేపట్టింది. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల పేరుతో ఉన్న అప్పును ప్రభుత్వమే చెల్లించి లబ్ధిదారుల పేరుతో రూపాయికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది. అయినా లబ్ధిదారులు గృహాల్లో చేరేందుకు ముందుకు రాకపోవడంతో ఇప్పటికీ టిడ్కో సముదాయం నిరుపయోగంగా ఉంది.

ఇళ్లకు పగుళ్లు...

టిడ్కో ఇళ్లు నిరుపయోగంగాఉండడంతో బేస్ లెవల్లో పగుళ్ల ఏర్పడ్డాయి. గృహాలు నిర్మించి పదేళ్ల గడవడం, ఎవరు లేకపోవడం వల్ల కూడా ఇల్లు నిరుపయోగంగా ఉండడంతో డోర్లు, కిటికీలు ఫ్లోర్ లెవెల్‌లో లీకేజీ ఏర్పడడం వంటి సమస్యలు ఉన్నాయని కొందరు లబ్ధిదారులు చెబుతున్నారు. ఆదోని పట్టణ శివారులో నిర్మించిన గృహ సముదాయంలో 4700 గృహాలు నిర్మించారు. అందులో 2000 పూర్తి అయ్యాయి. 300 ఇళ్లు లబ్ధిదారులు చేరేందుకు అంతా సిద్ధం చేశారు. అక్కడ త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పిస్తామని ఉన్నతాధికారులు ప్రకటన కూడా చేశారు. అయినా కేవలం 30 మంది మాత్రమే ఇళ్లల్లో చేరినప్పటికీ వారు కూడా రాత్రి వేళల్లో ఉండలేక వెనుతిరిగి వెళుతున్నారు. అక్కడ రవాణా సౌకర్యం లేదని మార్కెటింగ్ సదుపాయం లేదని చెబుతున్నారు. గృహాల చుట్టూ కంప చెట్లు తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్లంబింగ్ వర్క్స్, ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తామని చెబుతున్నా లబ్ధిదారులు అందులో చేరేందుకు అయిష్టత కనబరుస్తున్నారు. దీంతో లబ్ధిదారులు చేరకపోవడంతో తల ప్రాణం తోక కొచ్చిన చందంగా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా ఇళ్లల్లో చేరేలా చూడాలని ఉన్నత అధికారుల నుండి ఒత్తిడి ఉండడంతో తలలు పట్టుకుంటున్నారు.



సౌకర్యాలు కల్పించాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



పట్టణ శివారులో టిడ్కో గృహ సముదాయం ఉండడంవల్ల అక్కడఉండేందుకు భయ పడుతున్నారు. వారిలో భయాందోళన పోగొట్టేందుకు అక్కడ పోలీస్ గస్తీ ఏర్పాటు చేయించాలి. మార్కెటింగ్ కోసం దుకాణాలు రాక పోకలు సాగించేందుకు బస్సు సౌకర్యము కల్పిం చాలి. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తినా ఆస్పత్రికి తరలించేందుకు అక్కడే అంబులెన్స్ రాత్రి వేళల్లో ఉండే విధంగా అధికారులు చొరవ చూపాలి.

నోటీసులు జారీ

- కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్



టిడ్కో గృహ సముదాయంలో కేటాయించిన వారందరూ సత్వరమే చేరాలని నోటీసులు జారీ చేస్తున్నాం. కేటాయింపులు ప్రక్రియ పూర్తయినప్పటికీ ఎందుకు చేరడం లేదో అంతు పట్టని సమస్యగా మారింది. త్రాగునీరు సౌకర్యం కల్పించి గృహ సముదాయం అంతా చెత్తా చెదారం తొలగించి శుభ్రత పనులు కూడా చేయించాము. త్వరలో బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నాము. త్వరలో ఇంటిలో చేరని పక్షంలో తదుపరి చర్య ఉంటుంది. లబ్ధిదారులు సహకరించాలి.

మిరప పంటకు వైరస్

- ఆందోళన చెందుతున్న రైతన్న

ప్రజాశక్తి - నందవరం

మిరప పంటకు వైరస్ వ్యాప్తి చెందడం వల్ల రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మిరప పంటకు వైరస్ సోకి పంట పూర్తిగా నాశనం చెందిందని రైతులు తెలిపారు. వైరస్ సోకిన మిరప చెట్లు ఆకులు పూర్తిగా ముడుచుకొని మొక్కలు చనిపోయాయి. ఒక చెట్టు నుండి మరొక చెట్టుకు వైరస్ వ్యాప్తి చెంది పంట మొత్తం నాశనం అయిందని రైతులు తెలిపారు. పంటను కాపాడుకోవడానికి ఎన్ని రకాల క్రిమిసంహారక మందులు వినియోగించినా వైరస్ వ్యాప్తి తగ్గటం లేదు. వైరస్ వ్యాప్తి వల్ల మిరపకాయల సైజు కూడా పెరగటం లేదని తెలిపారు.

దిగుబడి తగ్గుతుంది

- వినోద్ గౌడ్, నందవరం



వైరస్ వ్యాప్తి వల్ల పంట నాశనం అయ్యింది. ప్రతి సంవత్సరం ఎకరాకు 20 క్వింటాలకు పైగా దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం వైరస్ వ్యాప్తి వల్ల దిగుబడి 12 క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఒక ఎకరాకు పెట్టుబడి ఇప్పటికే లక్ష రూపాయలుపైగా పెట్టడం జరిగింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు.



పంటను తొలగించాల్సి వచ్చింది

- వడ్డిగేరి నరసింహులు, నందవరం



అంతుచిక్కని వైరస్ వ్యాప్తి వల్ల పంట పూర్తిగా నాశనమైంది. వైరస్ నాశనానికి అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. అప్పులు తెచ్చి ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టడం జరిగింది. వైరస్ వ్యాప్తి చెందడం వలన వ్యాప్తి చెందినపంటను తొలగించాల్సి వచ్చింది. పంట నాశనం వల్ల అప్పులు కూడా కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనయే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, ఆస్పరి మాజీ జెడ్పిటిసి బొజ్జమ్మ అన్నారు. పరిధిలోని జిల్లేడుబుడకల గ్రామంలో ఆదివారం పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5 లక్షలు విలువగల సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీ నెరవేరుస్తుందని తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు బడే మియా, పెద్ద రంగస్వామి, సురేష్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగకు తిక్కారెడ్డి వర్గం దూరం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రభుత్వం నిర్వహించు పల్లె పండుగకు తిక్కారెడ్డి వర్గం దూరంగా ఉంది. ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో తిక్కారెడ్డి వర్గం కనిపించకపోవడంతో టిడిపి వర్గాల్లో విభేదాల ఇంకా కొనసాగుతూనే ఉన్నాయనే చర్చనడుస్తోంది. టిడిపి ప్రభుత్వం ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాల్లో సిసి రోడ్లు ఏర్పాటుకు భూమి పూజ చేసిన నేపథ్యంలో మండలంలో ఎక్కడా కూడా తిక్కారెడ్డి అనుచరులు హాజరు కాలేదు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి టిడిపి నుండి టిక్కెట్ ను పాలకుర్తి తిక్కారెడ్డి ఆశించిన విషయం తెలిసిందే. అయితే నియోజకవర్గంలో వాల్మీకులు అధికంగా ఉన్నారని భావించిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన టిడిపి టికెట్‌ను మాధవరం రాఘవేంద్రరెడ్డికి ఇచ్చి బరిలో దింపారు. టిడిపి నుండి టిక్కెట్ ను ఆశించి భంగపడ్డ తిక్కారెడ్డి, ఆయన అనుచరులు పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడ్డారు. అయితే ఎన్నికల్లో తిక్కారెడ్డి వర్గం సహకరించక పోవడంతోనే ఓటమి చెందామని బహిరంగానే తిక్కారెడ్డి వర్గం పై ఆరోపించిన విషయం తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు అటు రాఘవేంద్ర రెడ్డి, ఇటు తిక్కారెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. టిడిపి అధిష్టానం నియోజకవర్గ ఇంచార్జ్ గా తనకే బాధ్యతలు ఇచ్చారని ఎన్ రాఘవేంద్ర రెడ్డి చెబుతుండగా, ఇంచార్జీ బాధ్యతలు ఇంతవరకు ఎవరికీ అప్పగించలేదని తిక్కారెడ్డి అనుచరులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా టిడిపి అధిష్టానం మంత్రాలయం నియోజకవర్గం పై దృష్టి సారించి టిడిపి శ్రేణుల్లో ఉన్న విభేదాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలుగు తమ్ముళ్ళు కోరుతున్నారు.



జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

జర్నలిస్టు కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆలూరు

అనారోగ్యంతో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆలూరు జర్నలిస్టు సాహెబ్ జాన్ కుటుంబానికి ఆదివారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి, ఎంపిపి జెట్టప్ప గారి రంగమ్మ తనయుడు జె.వీరేష్ చెరో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సమాజంలో ఎటువంటి వేతనాలు లేకుండా ప్రజలకోసం ప్రజ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే జర్నలిస్టులకు ప్రభుత్వాలు అన్నీ విధాలుగా అండగా ఉండాలని తెలిపారు. సాహెబ్ జాన్ ఆరోగ్య పరిస్థితిని డాక్టరు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకొని, మంచి ఆరోగ్యవంతుడిగా తిరిగి మన ముందుకొస్తాడని కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. ఎమ్మెల్యే సోదరుడు వెంకటేష్, నాయకులు వీరేష్,ప్రకాష్ పాల్గొన్నారు.



ఎట్టకేలకు ఎమ్మెల్యే చొరవతో రోడ్డు గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నుండి పెద్ద హోతూరుకు వెళ్ళే ప్రధాన రహదారికి ఎట్టకేలకు ఎమ్మెల్యే విరుపాక్షి చొరవతో భయానక మైన రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ఆదివారం ఎమ్మెల్యే గుంతల రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు నుండి బళ్ళారి కి వెళ్ళే ప్రధాన రహదారిలో నిత్యం భారీ వాహనాలు, ఆటోలు, బస్సులు వెళ్తూ ప్రమాదాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలం చెందారన్నారు. రోడ్ల దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి తక్షణమే నిధులు కేటాయించి కాంట్రాక్టర్ ద్వారా రోడ్డు మరమ్మతులు చేపట్టినందుకు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు సోదరుడు వెంకటేష్, ఆలూరు కో కన్వీనర్ వీరేష్ అన్నారు.

పోలీస్ అంటే అధికారం కాదు బాధ్యత

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

పోలీసులంటే అధికారం కాదని ఓ బాధ్యతని ఓ సవాలు అని విధి నిర్వహణలో అమరులైన పోలీస్ సేవలను స్మరించుకుంటున్నామని కోడుమూరు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు పోలీస్ అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అను నిత్యం పోరాడుతున్నారని, దేశభద్రతలు సైనికులు, శాంతి భద్రతలో పరిరక్షణలో పోలీసులది కీలకమైన పాత్ర అని, విధి నిర్వహణలో ఒక్కోసారి ఆ సాంఘిక శక్తుల చేతిలో వీర మరణం పొందుతుంటారనిసేవలకు సలాం... నేడు పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం అని గుర్తు చేశారు. పోలీసు సమాజం కోసం తన ప్రాణాన్ని వదిలిపెట్టడానికి సిద్ధపడిన యోధుడని ఆయన పోలీసు సేవలను ప్రశంసించాడు. ఖాకి డ్రెస్ అంటే త్యాగనిరతి పోలీసు ఉద్యోగం అనేది ఓ సవాల్ బాధ్యత అని ఆయన అన్నారు. అసాంఘిక శక్తులు చట్టాలని చేతుల్లోకి తీసుకోవాలని అనుకుంటున్నాయని అలాంటి వాటిని ఎప్పటికప్పుడు అణచి వేసి దుష్టశక్తులకు గుణపాఠం చెప్పుకుంటే సమాజంలో రక్షణ ఉండదన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండడం వల్లే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఆయన పోలీసు సేవలను కొనియాడారు.

మండలంలో ముమ్మరంగా పల్లె పండుగ

పలు అభివద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఆదివారం మండల అధికారులు ముమ్మరంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరెడ్డి హాజరై వివిధ గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ముందుగా పెద్దనెలటూరు గ్రామంలో జల జీవన మిషన్ కింద రరూ.96.8 లక్షలతో చేపట్టనున్న 1,20,000 లీటర్ల సంపు 60 వేల లీటర్ల ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకు, పైపులైన్ పనులకు భూమి పూజ చేశారు. శంకర్ రెడ్డి ఇంటి నుంచి విరుపా క్షయ్య మఠం వరకు రూ.40 లక్షలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సిసి రోడ్డు కు రూ.2లక్షల 30 వేల ఉపాధి నిధుల కింద కు మంజూరైన మినీ గోకులం షెడ్డుకు భూమి పూజ చేశారు. గుల్లమరుసు గ్రామంలో పెద్దమరివీడు – చిన్న మరివీడు ప్రధాన రహదారి నుంచి రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులతో అప్రోచ్ రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ప్రస్తుత టిడిపి పార్టీ హయాంలో రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలకు ఉచిత కొళాయి ద్వారా త్రాగునీరు అందించడంతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీల ఏర్పాటు రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపిడిఒ మణి మంజరి, సర్పంచి సోమన్న, పంచాయతీరాజ్ డిఇ చంద్రశేఖర్, సిఐ గంగాధర్, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిడి అలీ పీరన్ ఇఒఆర్‌డి అనంతశయన, ఎడిఎ ఖాద్రి, ఏవో హేమలత ఎంఈఓ లు రామాంజనేయులు, నీలకంఠ , టిడిపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ, కర్ణాటకలో హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వెంటనే కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని బాష ఆధ్వర్యంలో జరిగిన పోస్ట్ కార్డు ఉద్యమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి కొత్త బస్టాండ్ నుండి ఆర్‌టిసి బస్సులో ప్రయాణం చేసిన డిసిసి అధ్యక్షులు పి.మురళీకష్ణ మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలు అయినా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడని అడుగుతున్నారన్నారు. ఐదేళ్లు ఇలానే కాలయాపన చేస్తారా? ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు భద్రత ఉంటుందని, మహిళలు ఆర్థిక ఉపశమనం పొందుతారని మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎస్.ప్రమీల, జిల్లా సేవాదళ్ మాజీ అధ్యక్షురాలు ఎ. వెంకట సుజాత, డిసిసి మాజీ సెక్రెటరీ అబ్దుల్ హై, కాంగ్రెస్ నాయకులు సాయికృష్ణ, ప్రతాపరెడ్డి, రమేష్, మధు, ఐఎన్‌టియు సి నాయకులు ఎన్.సుంకన్న, గోవిందు, చక్రి మహిళా కాంగ్రెస్ కరుణమ్మ, అయ్యమ్మ, సావిత్రి, రాములమ్మ పాల్గొన్నారు.

పజాశక్తి-ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు బస్టాండ్ నుంచి మంత్రాలయం బస్సులో తోటి మహిళా ప్రయాణికులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రయాణించారు. కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పి.జీ నరసింహులు యాదవ్, ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు కాసిం వలి ఆదివారం మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలు అయినా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నారు. మహిళలకు భద్రత విషయంలో ముందడుగు పడాలి. ముఖ్యమంత్రికి రాబోయే రెండు మూడు రోజుల్లో పెద్ద ఎత్తున పోస్ట్ కార్డులు పంపిస్తామన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దాదా కలందర్, జైపాల్, లోకేష్, వలి, షబానా, వరుణ్ బి, బాబి,మాబి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తూ మీడియాతోమాట్లాడిన మురళీకృష్ణ